నిరాడంబరంగా ప్రమాణ స్వీకారం



శ్రీవారి ఆలయం ముందు ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు, కుటుంబీకులతో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

- క్షేత్రసంప్రదాయాన్ని పాటిస్తూ శ్రీవారి దర్శనం చేసుకున్న టీటీడీ చైర్మన్

తిరుమల, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం బుధవారం నిరాడంబరంగా జరిగింది. తిరుమల శ్రీవారి ఆలయంలో ఉదయం చైర్మన్ బీఆర్ నాయుడు, మరో 15 మంది సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా దేవదాయ శాఖ కార్యదర్శి ప్రమాణ స్వీకారం చేశారు. సంప్రదాయ వస్త్రధారణ, నుదుట నామంతో క్షేత్రం సంప్రదాయాన్ని పాటిస్తూ బీఆర్ నాయుడు తొలిగా పుష్కరిణి నీటి ప్రోక్షణ చేసుకుని వరాహస్వామిని దర్శించుకున్నారు. తర్వాత కూలైన్‌లో ఆలయంలోకి వెళ్లి ప్రమాణస్వీకారం చేశాక శ్రీవారిని దర్శించుకున్నారు. సాధారణంగా చైర్మన్ అంటే పుష్పగుచ్ఛాలు అందజేసి, పట్టువస్త్రాలతో సత్కరించే హడావుడి అధికంగా ఉంటుంది. ఈయన మాత్రం బొకే సంప్రదాయం వద్దని నిరాకరించడంతో ఆలయం ముందు ఎలాంటి హడావుడి కనిపించ లేదు. ఆలయం ముందూ ఎలాంటి ప్రసంగాలు చేయకుండా వెళ్లిపోయారు. ఇక సభ్యుల్లోనూ రాజకీయ నాయకులున్నా కార్యకర్తల హడావుడి కనిపించలేదు. తొలిరోజే సభ్యులు, టీటీడీలోని పలు విభాగాల అధికారులతో చైర్మన్ సమీక్షించారు. ఆయా విభాగాలు చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన పెంచుకునేందుకు సుదీర్ఘంగా సమావేశాన్ని నిర్వహించారు. భక్తులకు చేపట్టాల్సిన సౌకర్యాలపై చర్చించడంతో పాటు గతంలో తలెత్తిన ఇబ్బందులు, విమర్శలపైనా మాట్లాడారు.

నేడు మరో ముగ్గురు

మిగిలిన సభ్యుల్లో ఫార్మా రంగానికి చెందిన సుచిత్ర ఎల్లా, స్థానిక బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి, ముని కోటేశ్వరరావు గురువారం ప్రమాణం చేయనున్నారు. వీరితో పాటు కృష్ణమూర్తి వైద్యనాథన్ కూడా ప్రమాణం చేయాల్సి ఉన్నప్పటికీ ఆయన నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇక, జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, సదాశివరావు శుక్రవారం ప్రమాణం చేయనున్నారు.

వారం రోజుల్లో 93,203 బుకింగ్స్

- ఉచిత గ్యాస్‌కు అనూహ్య స్పందన
- 62,300 మందికి సిలిండర్ల డెలివరీ
- 26,100 మంది ఖాతాల్లో నగదు జమ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉచిత గ్యాస్ బుకింగ్‌కు అనూహ్య స్పందన కనిపిస్తోంది. దీపం-2 కింద ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమల్లోకి వచ్చిన వారం రోజుల్లో 93,203 మంది బుక్ చేసుకున్నారు. ఒక్కో ఏజెన్సీ నుంచి నగరాలు, పట్టణాల్లో అయితే రోజుకు సగటున 450 నుంచి 500.. గ్రామీణ ప్రాంతాల్లో 300 వరకు సిలిండర్లు బుక్ అవుతున్నట్లు గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు చెబుతున్నారు. ఇందులో 45 నుంచి 50 శాతం వరకు ఉచిత గ్యాస్ బుకింగ్‌లు జరుగుతున్నాయి. ఈ లెక్కన వారం రోజుల వ్యవధిలో 62 ఏజెన్సీల ద్వారా దాదాపు 93,203 మంది ఉచిత గ్యాస్ కనెక్షన్ల కోసం బుక్ చేసుకున్నారు. అందులో 62,300 మందికి సిలిండర్లు డెలివరీ అయ్యాయి. వీరిలో చాలా మంది ఈకేవైసీ చేసుకోకపోవడంతో ఇప్పటి వరకు 26,100 మందికి మాత్రమే నగదు జమైంది. మిగిలిన వారు ఈకేవైసీ చేసుకోవాలని, రానున్న మూడు నెలల వ్యవధిలో అందరికీ నగదు జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు నగదు జమకాని వారు సంబంధిత గ్యాస్ ఏజెన్సీలను, డీఎస్‌వోను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు సూచించారు.

అనుమానాలుంటే నివృత్తి చేసుకోండి

గ్యాస్ కనెక్షన్, తెల్ల రేషన్ కార్డు ఉన్నప్పటికీ ఆధార్ ఇవ్వకపోవడంతో కొందరు ఉచిత గ్యాస్‌కు అర్హత పొందలేక పోయారు. వీరు ఆధార్ అనుసంధానం చేసుకుంటే పథకానికి అర్హులవుతారు. కుటుంబ సభ్యుల్లో ఎవరి పేరిట గ్యాస్ కనెక్షన్ ఉందో ఆ వ్యక్తి పేరు రేషన్ కార్డులో ఉంటే పథకానికి సంబంధించిన రాయితీ వర్తిస్తుంది. భార్య పేరుతో రేషన్ కార్డు, భర్త పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉన్నా అర్హులవుతారని ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఇంకా ఎవరికైనా అనుమానాలుంటే 1967 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోను చేసి తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

రుయాలో 'ఓపీ'కకు పరీక్ష

- గంటల తరబడి క్యూలో నిరీక్షిస్తున్న రోగులు



ఓపీ కోసం నిరీక్షిస్తున్న మహిళలు



చిన్నారికి పెట్టిన సెలైన్‌తో ఓపీలో తిరుగుతున్న సహాయకులు

తిరుపతి(వైద్యం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం సుదూర ప్రాంతాల నుంచి రుయాస్పత్రికి వచ్చే రోగుల 'ఓపీ'కకు పరీక్ష పెడుతున్నారు. 'ఈ- వైద్యం' పేరిట ఓపీ నిబంధనలను మార్చడంతో తిప్పలు పడుతున్నారు. గతంలో ఆధార్.. ఫోను నంబరు, చిరునామా చెబితే ఓపీ ఇచ్చేవారు. రోగుల సహాయకులు క్యూలో నిలబడి ఓపీ తీసుకునేవారు. ఇటీవల ఈ-వైద్యం పేరుతో ఓపీ ఇచ్చే నిబంధనలను అధికారులు మార్చారు. ఆ ప్రకారం.. ఓపీ తీసుకోవాలంటే నేరుగా రోగులే వచ్చి ఓపీ కేంద్రంలో వేలిముద్ర వేయాలి. ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబరుతో మాత్రమే ఓటీపీ విధానంతో ఓపీ తీసుకోవాలి. అసలే జబ్బు చేసి బాధపడే రోగులు ఓపీ కోసం క్యూలో నిలుచుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నుంచే రోగులు రుయాస్పత్రికి వస్తుంటారు. అటువంటి వారి ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానం ఉండదు. ఈ క్రమంలో వారు ఓపీ అందక వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంటోంది. మూడు రోజులుగా ఈ విధానం వలన ఓపీ కేంద్రం రోగులు, వారి సహాయకులతో కిటకిటలాడుతోంది. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకే ఓపీ సమయం ఉంటుంది. సాధారణ రోజుల్లో ఓపీ కోసం వెయ్యి నుంచి 1,200 మందికి పైగా వస్తుంటారు. సోమ, బుధవారాల్లో ఈ సంఖ్య 1,500 పైగా ఉంటుంది. కొత్త విధానం అమల్లోకి రావడంతో మూడు రోజులుగా 800 మందికి కూడా ఓపీ అందడం లేదు. రోగి పూర్తి వివరాలు నమోదు చేయడంతోపాటు వారి వేలిముద్ర కూడా తీసుకోవాల్సి ఉండటంతో ఒక్కో రోగికి ఓపీ ఇచ్చేందుకు పది నిముషాల సమయం పడుతోంది. సమయం లేక అనేక మంది ఓపీ అందకనే వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంటోంది. నడవలేని, వృద్ధులు, వికలాంగులు ఓపీ క్యూలో ఇబ్బందులు పడుతున్నారు. రుయా అధికారులు దీనిపై దృష్టి సారించి, రోగులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఓపీ సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.

నాడు శ్రీగంధం కేసులో సస్పెన్షన్

- నేడు ఎర్రచందనం కేసులో అరెస్టు
- ఎర్రావారిపాళెం కానిస్టేబుల్ నిర్వాకం



గుర్రప్ప

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెండు నెలల కిందట శ్రీగంధం కేసులో సస్పెండైన కానిస్టేబుల్ గుర్రప్ప.. బుధవారం ఎర్రచందనం కేసులో అరెస్టయ్యారు. ఎర్రావారిపాళెం పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇతడిపై అనేక ఆరోపణలున్నాయి. గతంలో శ్రీగంధం అక్రమ రవాణా కేసులో కొంతమంది నిందితులను, ఆటో డ్రైవర్ సుబ్రహ్మణ్యం రెడ్డిని బెదిరించి మామూళ్లు తీసుకున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఘటనలో రెండు నెలల కిందట కానిస్టేబుల్ గుర్రప్పను సస్పెండు చేశారు. దీనిపై లోతైన దర్యాప్తు చేయాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. ఈ క్రమంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సమగ్ర విచారణ చేపట్టగా.. ఎర్రచందనం అక్రమ రవాణా కేసులోనూ గుర్రప్పకు ప్రమేయం ఉన్నట్లు తేలింది. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ఏ4 ముద్దాయితో నేరుగా సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో నిర్ధారణ అయింది. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. రిమాండుకు తరలించారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఎస్పీ ఆదేశించారు.

ప్రమాదాల నివారణకు డ్రోన్ కెమెరాతో సర్వే

పాకాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు డ్రోన్ కెమెరాలతో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బుధవారం సర్వే చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో సీఐ మద్దయ్య ఆచారి డ్రోన్ కెమెరాలతో గుంతగాదంకి, నేంద్రగుంట ప్రాంతాల్లో ప్రమాద స్థలాన్ని గుర్తించినట్లు సీఐ తెలిపారు.


డ్రోన్ కెమెరాతో సర్వే చేయిస్తున్న సీఐ మద్దయ్య

ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యుడిగా బద్రీ నారాయణ



పాకాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కార్యనిర్వాహక సభ్యుడిగా పాకాల వాసి వీఎస్ బద్రీనారాయణ నియమితులయ్యారు. ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్నిరామ సత్యనారాయణ ఈయనను నియమించారు. ఈ సందర్భంగా బద్రీనారాయణ మాట్లాడుతూ తన నియామకానికి కృషిచేసిన మహాసభ ఉపాధ్యక్షుడు మువ్వల సర సింహులుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్యులు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా అభివృద్ధి చెందడానికి కృషిచేస్తానన్నారు.

పంటపొలాలపై కొనసాగుతున్న ఏనుగుల దాడి

పాకాల, నవంబరు 6 (ఆంధ్రప్రదేశ్): మండల పరిధిలోని చంద్రగిరివారిపల్లె వల్లివేడు పరిసర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి కూడా పంటపొలాలపై ఏనుగులు దాడి చేశాయి. సోమవారం రాత్రి పంటపొలాలపై ఏనుగులు దాడి చేసి రైతులకు తీవ్ర నష్టం కలగజేశాయి. సమీప అటవీ ప్రాంతాల్లో తిష్టవేసి గత మూడు రోజులుగా పంటపొలాలపై దాడి చేస్తున్నాయి. మామిడి చెట్లు విరిచేసి, పైపు లైన్లు ధ్వంసం చేస్తున్నాయి. ఈ ప్రాంత రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వీటి భారి నుంచి రక్షించి నష్టపోయిన పంటకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.


ఏనుగుల గుంపు విరిచేసిన మామిడి చెట్లు

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ దూరం



సమావేశంలో మాట్లాడుతున్న హేమంత్‌కుమార్

రామచంద్రాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సకాలంలో గుర్తిస్తే క్యాన్సర్ నయమవుతుందని జిల్లా కేంద్ర ప్రోగ్రామ్ మేనేజర్ హేమంత్‌కుమార్ అన్నారు. వెంకట్రామాపురం సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో బుధవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా హేమంత్‌కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో వచ్చిందన్నారు. ఫార్మసీ విద్యార్థులు వెంకట్రామాపురం గ్రామంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు, వైద్యులు వెంకయ్య, జ్యోతి, సునీల్‌కుమార్, నిర్మల పాల్గొన్నారు.

11 నుంచి రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు

చంద్రగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 11 నుంచి 20 వరకు రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు నిర్వహించనున్నారు. 11వ తేదీ ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకం నిర్వహించాక విభూది అభిషేకం చేస్తారు. సాయంత్రం ఉత్సవాలకు భూమిపూజ చేయనున్నారు. 12న ఉదయం అంకురార్పణ, కలశస్థాపన, మండపారాధన, గణపతి హోమం, ధ్వజారోహణం, పూర్ణాహుతి జరుగుతుంది. అనంతరం ఆంజనేయస్వామి,షణ్ముఖస్వామిలకు అభిషేకం చేస్తారు. రాత్రి మూషిక వాహనంపై వినాయకస్వామిని ఊరేగిస్తారు. 13న మయూర వాహనంపై వళ్లీదేవసేన, సుబ్రమణ్యంస్వామి ఊరేగుతారు. రాత్రి సింహ వాహనంపై అమ్మవారిని ఊరేగిస్తారు. 14న శేష వాహనంపై స్వామి అమ్మవార్లను ఊరేగిస్తారని ఆలయ ధర్మకర్త రఘునాథరెడ్డి తెలిపారు.

భాకరాపేట బస్టాండు పరిశుభ్రతకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భాకరాపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): భాకరాపేట ఆర్టీసీ బస్టాండును ఎట్టకేలకు శుభ్రపరిచారు. ఈ ఆవరణ అపరిశుభ్రంగా ఉండటంతో పాటు వాహనాల పార్కింగ్ కేంద్రంగా మారడంతో బస్టాండులోకి ఆర్టీసీ బస్సులు రావడం లేదు. దీనిపై మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం వెలువడింది. దీంతో తిరుపతి ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ స్పందించి కంట్రోలర్‌ను పంపించి శుభ్రం చేయించారు. అనధికారంగా వాహనాలను ఇకపై పార్కింగ్ చేయకుండా స్థానికులతో మాట్లాడారు. ఆదారిలో వెళ్ళే ఆర్టీసీ బస్సులు బస్టాండుకు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఖాళీగా ఉన్న స్టాల్స్‌కు త్వరలోనే టెండర్లు పిలిచి అనధికార పార్కింగ్‌ను కట్టడి చేస్తామన్నారు.


పరిశుభ్రంగా ఆర్టీసీ బస్టాండు

యూటీఎఫ్ మండల కార్యవర్గ ఎన్నిక

చంద్రగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలం యునైటెడ్ ఫెడరేషన్ (యూటీఎఫ్) కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండలంలోని యూటీఎఫ్ సంఘం ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడిగా కె.రామిరెడ్డి, మండల అధ్యక్షుడిగా పి.రాజేంద్రబాబు, సహాధ్యక్షులుగా పి.లక్ష్మి, ఎస్.హరికుమార్, జనరల్ సెక్రటరీగా ఆర్.ధనంజయ, కోశాధికారిగా కె.చెంచయ్యలను ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు.

● రామచంద్రాపురం: మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా లోకేశ్‌బాబు ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో బుధవారం యూటీఎఫ్ కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా పీవీఎస్ఎన్ రాజు, గౌరవ అధ్యక్షుడిగా బాబురెడ్డి, సహ అధ్యక్షులుగా పరమేశ్వరీ, రాజేష్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మదుసూధన్, పరిశీలకులుగా రమేష్‌నాయుడు వ్యవహరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నిర్మల, పద్మజ పాల్గొన్నారు.




రాజేంద్రబాబు-ధనంజయ-లోకేశ్‌బాబు

ఐక్య పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరయ్య అన్నారు. బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. కార్మిక, కర్షకులకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు చేపడుతున్న విధానాలకు నిరసనగా ఈ నెల 26న దేశ వ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు ఎ.రామానాయుడు, మాంగాటి గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, బాలసుబ్రమణ్యం, ఆర్.వెంకయ్య, వెంకటరత్నం, పి.హేమలత, జయచంద్ర, శ్రీనివాసులు, నరసింహులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు

తిరుమల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. టీటీడీ బుధవారం ఉదయం ఆదాయ వివరాలను ప్రకటించింది. మంగళవారం 68,146 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

చంద్రగిరి

శ్రీవారిసేవలో ప్రముఖులు


వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి,



ఎంపీ ప్రసాదరావు - భాష్యం ప్రవీణ్

తిరుమల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎంపీలు ప్రసాదరావు, వేమిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యురాలు ప్రశాంతిరెడ్డి, డీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, సౌమ్య, బత్తుల బలరామకృష్ణ, దగ్గుబాటి ప్రసాద్, దస్తగిరి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఇసుక తరలింపులో ఇరువర్గాల వివాదం

చంద్రగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నాగయ్యగారిపల్లె వద్ద స్వర్ణముఖినదిలో అక్రమ ఇసుక తరలింపులో ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. గ్రామ బీజేపీ నాయకురాలు లక్ష్మీ తన పొలం వద్ద స్వర్ణముఖినదిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నాగరాజునాయుడు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. తమ గ్రామ పొలిమేరల్లో అక్రమంగా ఇసుక తరలించకూడదని పదేపదే చెబుతున్నా బీజేపీ నాయకురాలు పట్టించుకోలేదని అందుకే ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్నామన్నారు. తన పొలం వద్ద ఇసుకను తరలించుకొంటే టీడీపీ నాయకులకు ఇబ్బంది ఏమిటని లక్ష్మి ప్రశ్నించారు. ఇరువర్గాలు దూషించుకొన్నారు. ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. గ్రామస్థులు ఇరువర్గాలకు సర్దిచెప్పారు.

అదుపు తప్పిన కారు నలుగురికి గాయాలు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-మంగళం రహదారిలోని రెడ్డి భవన్‌కు ఎదురుగా ఉన్న గోదేవి ఆండాల్ రోడ్డులో బుధవారం సాయంత్రం కారు అదుపు తప్పి వేగంగా డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో నలుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. అలిపిరి ఎస్ఐ లోకేష్ బాబు వివరాల మేరకు... దాసరిమఠానికి చెందిన కబాలి, కేశవ, నూరు, గురులు స్థానికంగా కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. పనులు ముగించుకుని ఆండాల్ రోడ్డు పక్కనున్న డివైడర్‌పై కూర్చుని ఉన్నారు. ఆ సమయంలో అటుగా వచ్చిన కారు అదుపు తప్పి వేగంగా డివైడర్ పైకి ఎక్కింది. ఈ ఘటనలో అక్కడ కూర్చుని ఉన్న నలుగురికి స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రుయాకు తరలించారు. అలిపిరి ఎస్ఐ లోకేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నా భర్త కనిపించడం లేదు

అత్తింటివారిపై భార్య ఫిర్యాదు


అమృత, మంజునాథరెడ్డి

రామకుప్పం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తన భర్త కనిపించడం లేదంటూ రామకుప్పం మండలం పెద్దగానూరుకు చెందిన అమృత బుధవారం పోలీసులకు పిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి గోవిందపల్లెలోని అమృత మామ మురుగేష్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లిన తన భర్త మంజునాథరెడ్డి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్టోబరు 16న తాము కులాంతర వివాహం చేసుకున్నామని, మంజునాథ రెడ్డి కుటుంబీకులు దీనిని అంగీకరించలేదని అన్నారు. అప్పటి నుంచి తరచూ ఫోన్ చేసి దుర్భాషలాడుతూ, మానసిక వేధింపులకు పాల్పడేవారని వివరించారు. తన అత్తగారింటి వారిపై తనకు అనుమానాలున్నట్టు ఆమె పిర్యాదులో పేర్కొన్నారు. రామకుప్పం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జెడ్పీటీసీ మెంబర్ గదికి దారేది.?

● అడ్డదిడ్డంగా పడేసిన డస్ట్‌బిన్లు
● మార్గం లేక మరోచోట కూర్చుంటున్న ప్రజాప్రతినిధి

తిరుపతిరూరల్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో గత ప్రభుత్వంలో వైసీపీ జెడ్పీటీసీ సభ్యురాలికి కేటాయించిన గదికి వెళ్లేదారికి ఎదురుగా చెత్తసేకరణ డస్ట్‌బిన్లను అడ్డదిడ్డంగా పరిచేశారు. పంచాయతీల్లో వ్యర్థాల సేకరణకు గత ప్రభుత్వంలో ఎన్నికల ముందు తెప్పించిన వీటిని కోడ్ అమలులో ఉందని ఎంపీడీవో కార్యాలయ పైఅంతస్తులోని కారిడార్, రిసెప్షన్ కేంద్రంలో డంప్ చేశారు. కార్యాలయానికి వచ్చే జెడ్పీటీసీ సభ్యురాలు ఈగదిలోకి వెళ్లేందుకు దారిలేకపోవడంతో ఎంపీపీగదిలోనే కొంత సమయం ఉండి వెళ్లిపోతున్నారని తెలిసింది. స్వచ్ఛాంధ్ర మిషన్ నుంచి దాదాపు 20వేల పచ్చ,నీలిరంగు బుట్టలను ఏప్రిల్15వ తేదీన మండలానికి తీసుకొచ్చారు. వీటిని రిసెప్షన్ కేంద్రంతోపాటు ఎంపీడీవో కార్యాలయ పైఅంతస్తులో ఉంచేశారు. ఇటీవల ఆంధ్రజ్యోతి పత్రికలో రిసెప్షన్ కేంద్రంలో డస్ట్‌బిన్లని డంప్‌చేసి వదిలేశారన్న శీర్షికతో కథనం ప్రచురించగా బుధవారం అధికారులు స్పందించారు. పంచాయతీలకు వీటిని పంపిణీ చేశారు కానీ పైఅంతస్తులోని జెడ్పీటీసీ సభ్యురాలు గదికి ఎదురుగా ఉన్నవాటిని మాత్రం ఇప్పటికీ అలాగే వదిలేశారు. ఈ అంశంపై ఏవో రంగనాథాన్ని వివరణ కోరగా.. డస్ట్‌బిన్లను పంచాయతీలకు పంపిణీ చేశామన్నారు. స్వచ్ఛాంధ్ర లోగో, స్టిక రింగ్ వేస్తుండడంతో అలాగే ఉన్నాయన్నారు. వీటిని ఒకట్రెండురోజుల్లో పంచాయతీలకు చేరవేస్తామన్నారు.


జెడ్పీటీసీ గదిలోకి వెళ్లేందుకు అడ్డుగా పేరుకున్న డస్ట్‌బిన్లు

అన్నప్రసాదాలు స్వీకరించిన టీటీడీ చైర్మన్



తిరుమల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనాన్ని బుధవారం రాత్రి టీటీడీ నూతన చైర్మన్ బీఆర్ నాయుడు పరిశీలించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి అన్నప్రసాదాలు స్వీకరించారు. డిప్యూటీ ఈవో రాజేంద్ర అన్నప్రసాద కార్యాకలపాలను చైర్మన్‌కు వివరించారు. అన్నప్రసాద భవనంలో ఒకరోజులో ఎంతమంది అన్నప్రసాదాలు స్వీకరిస్తారు, అందిస్తున్న వివిధ రకాలైన ఆహారపదార్థాలు, అన్నప్రసాద భవనం పనిచేసే వేళలు తదితర విషయాల గురించి చైర్మన్‌కు వివరించారు.

చంద్రగిరి రామాలయ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే నాని


రామాలయ అభివృద్ధిపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పురాతన రామాలయాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పులివర్తి నాని చెప్పారు. బుధవారం ఆయన రామాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం ముందు కోనేరు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ టూరిజం ఆధ్వర్యంలో ఇక్కడికి బస్సులు వచ్చేలా అధికారులతో మాట్లాడతానన్నారు. దాతల సాయం కూడా ఆలయ అభివృద్ధికి తీసుకొంటామన్నారు. ప్రణాళికలు రూపొందించి, నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుపతి కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ ఫీజు చెల్లించలేదని గూడూరులోని నర్సింగ్ కాలేజీలో 40 మంది విద్యార్థులను తరగతుల నుంచి బయటకు పంపారని, దీనిపై ఇదివరకే కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. జూనియర్ కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. యూనివర్సిటీల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. తొమ్మిది నెలల నుంచి మెస్ ఛార్జీలు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదని తెలిపారు.

అపరిశుభ్రంగా అలిపిరి డిపో



తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అలిపిరి ఆర్టీసీ డిపో, గ్యారేజీ ఆవరణ వ్యర్థాలతో నిండిపోయి అపరిశుభ్రంగా ఉంటోంది. కుండీలు నిండిపోవడంతో చెత్తకుప్ప రోజురోజుకూ విస్తరిస్తోంది. కుళ్లిపోయి కంపుకొడుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. చెత్త కుప్పలో ఎండిన ఆకులు, కాగితాలు అధికంగా ఉండడంతో అగ్నిప్రమాదానికి దారితీయ్యవచ్చు. తద్వారా పక్కనే పార్కు చేసున్న బస్సులకు మంటలు వ్యాపించే ప్రమాదముంది. అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. కార్పొరేషన్ సిబ్బంది కనీసం వారానికి ఒకసారి కూడా చెత్త తరలించడం లేదని ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు.

దేవప్రసాదరాజు నియామకంపై మందకృష్ణ హర్షం


దేవప్రసాదరాజును సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 70 ఏళ్ల చరిత్ర గల ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాధిపతిగా తొలిసారిగా దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్ దేవప్రసాదరాజు నియామకం పట్ల ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హర్షం వ్యక్తం చేశారు. ఫోన్‌లో బుధవారం అభినందించారు. దేవప్రసాదరాజు మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. నాయకులు నరేంద్ర, వెంకటస్వామి, గోపి, రవి, శేషయ్య, వాసుదేవరావు, శివయ్య, నవీన్ తదితరులు ప్రొఫెసర్ దేవప్రసాదరాజును సత్కరించారు.

ఓవరాల్ చాంపియన్ ఎస్వీడబ్ల్యూ కళాశాల జట్టు




ఎస్వీయూ కాలేజీ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ప్రిన్సిపాల్ సుధారాణి-ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ఎస్వీడబ్ల్యూ కాలేజీకి షీల్డ్ అందజేత

తిరుపతి(క్రీడలు), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ మైదానంలో జరుగుతున్న మహిళా అంతర్ కళాశాలల క్రీడా పోటీల ఓవరాల్ చాంపియన్‌గా ఎస్వీడబ్ల్యూ కళాశాల జట్టు నిలిచింది. కబడ్డీలో ఎస్వీయూ కాలేజీ జట్టు విజయం సాధించింది. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీ జట్టు, డబుల్స్‌లో ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీ(తిరుపతి), టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో సీకాం డిగ్రీ కాలేజీ, డబుల్స్‌లో సీకాం డిగ్రీ కాలేజీ విజయం సాధించాయి. చదరంగంలో ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీ విన్నర్, రన్నరప్‌గా నిలిచింది. ముగింపు కార్యక్రమానికి హాజరైన ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుధారాణి, వ్యాయామ విభాగాధిపతి ఎం.శివకుమార్‌రెడ్డి విజేతలకు షీల్డ్ ప్రదానం చేశారు.

మరకతశక్తి అమ్మవారి సేవలో సినీనటి జయలలిత


రమ్యానందభారతి నుంచి ఆశీర్వాదం తీసుకుంటున్న జయలలిత

రామచంద్రాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట శ్రీశక్తి పీఠంలో వెలసిన మరకతశక్తి కాళికా అమ్మవారిని సినీనటి జయలలిత బుధవారం దర్శించుకున్నారు. ఈమెకు ఆలయ నిర్వాహకులు దర్శనం ఏర్పాటు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం శక్తిపీఠాధీశ్వరి రమ్యానందభారతిని మర్యాద పూర్వకంగా కలసి ఆశీర్వాదం స్వీకరించారు.

మద్యం విక్రేత అరెస్టు


పోలీసుల అదుపులో నిందితుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని బుధవారం తిరుపతిలో ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి 20 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన సంపత్ కుమార్ కొంతకాలంగా మద్యం దుకాణాల నుంచి మద్యం తీసుకొచ్చి ఇంటి వద్ద బెల్టు దుకాణం నిర్వహిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ఈ సమాచారం అందడంతో ఏఈఎస్ వాసుదేవ చౌదరి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్సు సీఐ శ్యామ్, ఎస్ఐ స్వామినాథన్, సిబ్బందితో కలిసి బుధవారం తనిఖీలు చేశారు. విక్రయానికి సిద్ధంగా ఉన్న 20 క్వార్టర్ బాటిళ్లను సీజ్ చేశారు. సంపత్‌కుమార్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

శ్రీకాళహస్తి, నవం బరు 6 (ఆంధ్రజ్యోతి) : మహిళను హతమార్చి పరారైన కేసులో చెంచయ్య అనే నింది తుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించి నట్లు శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవి నాయక్ తెలి పారు. ఆయన తెలిపిన వివరాలు... బుచ్చినా యుడు కండ్రిగ మండలం కాటూరుకు చెందిన కృష్ణయ్య శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు సమీపంలో ఓ రైతు వద్ద పంట పొలాల్లో పని చేసేవాడు. అక్కడే పని చేస్తున్న తుపాకుల బత్తెమ్మతో పరిచయం ఏర్పడి మూడో వివాహం చేసుకున్నాడు. వారి మధ్య విభేదాలు తలెత్తడంతో గత నెల 3న బత్తెమ్మను హతమార్చిన చెంచయ్య ఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం నిందితుడు చెంచయ్య రూరల్ పోలీసులకు లొంగి పోయాడు. అతన్ని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ రవి నాయక్ తెలిపారు.

ముక్కంటి సేవలో నర్సిరెడ్డి

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని టీటీడీ పాలక మండలి సభ్యుడు నర్సిరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురువారెడ్డి స్థానిక నాయకులతో కలిసి నాలుగో గేటు వద్ద వారికి స్వాగతం పలికారు. అనంతరం అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం మృత్యుంజయ స్వామి సన్నిధిలో వేద పండితులు శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ముక్కంటి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని బుధవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. తిరుచానూరుకు చెందిన శివనాట్య కళానిలయం 21 మంది సభ్యులతో గురువు సంధ్య ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. ముక్కంటి ఆలయ అధికారులు కళాకారులను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరుపతి

15న కపిలతీర్థంలో అన్నాభిషేకం

తిరుపతి(కల్చరల్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాలలో భాగంగా ఈ నెల 15వ తేదీన కపిలేశ్వరస్వామి ఆలయంలో అన్నాభిషేకం నిర్వహించనున్నారు. ఉదయం 2 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలుపుతారు. 2.30 నుంచి వేకువజామున 4.30 గంటల వరకు అభిషేకం, అలంకారం, పూజ, అర్చన నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏకాంతంగా అన్నాభిషేకం, దీపారాధన చేపడతారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు అన్నలింగ దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఏకాంతంగా అన్నలింగ ఉద్వాసన చేపడతారు. శుద్ధి అనంతరం రాత్రి 7 నుంచి 8 గంటల వరకు సుగంధద్రవ్య అభిషేకం ఏకాంతంగా నిర్వహిస్తారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి



తిరుపతి(జీవకోన), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, మురళీమోహన్ చెప్పారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం బుధవారం తుడా కార్యాలయ వెనుకభాగంలో వున్న కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్‌కు సొంత భవన ఏర్పాటుకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం,ఎస్పీ సుబ్బరాయుడు,టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, అన్నా రామచంద్రయ్య , అన్నా అనిత తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌కు అభినందన



టీటీడీ చైర్మన్‌కు స్వామివారి ప్రతిమను బహూకరిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బీఆర్‌నాయుడిని బుధవారం సాయంత్రం టీడీపీ సీనియర్ నేత, తిరుపతి కో-ఆపరేటివ్ మాజీ చైర్మన్ పులుగోరు మురళీకృష్ణారెడ్డి, గంగమ్మగుడి పాలకమండలి మాజీ సభ్యుడు గంజి సుధాకర్‌రెడ్డి, వెంకటేష్, పురుషోత్తంరెడ్డి, శరత్ మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. శాలువకప్పి ఘనంగా సత్కరించారు. శ్రీవారి ప్రతిమను అందజేశారు.

విద్యార్థులకు క్రీడలు అవశ్యం



వారాహి జ్యోతిర్విజ్ఞాన శోధపత్రికను ఆవిష్కరిస్తున్న కాశీవిశ్వేశ్వర శర్మ, వీసీ కృష్ణమూర్తి

తిరుపతిరూరల్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు శాస్త్రవిజ్ఞానంతోపాటు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు ఎంతో అవసరమని శ్రీశైలం శ్రీదేవి వేదవిద్యాలయం మేనేజింగ్ ట్రస్టీ బ్రహ్మశ్రీ కాశీవిశ్వేశ్వర శర్మ తెలిపారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ ఇండోర్ స్టేడియంలో ఏకలవ్య క్రీడామంచ్ కార్యక్రమాన్ని వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తితో కలసి ఆయన ప్రారంభించారు. జ్యోతిష విభాగం ద్వారా ప్రారంభించిన వారాహి జ్యోతిర్విజ్ఞాన శోధపత్రికను ఆవిష్కరించారు. జ్యోతిష శాస్త్రానికి ఉన్న మహత్యాన్ని తెలిపేవిధంగా పత్రికను రూపొందించడం సంతోషదాయకమని తెలిపారు. వీసీ మాట్లాడుతూ వర్సిటీని శాస్త్ర, సంగీత, క్రీడా విషయాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కాగా ఫ్లూట్ విద్వాంసులు కొమరవోలు శివప్రసాద్‌కి వర్సిటీ తరఫున సీటికా కోవిదులు, గుంటూరు చిన్నారి శ్రీహవనిని సంగీత బాలసరస్వతి, డాక్టర్ టీకే శశికళకు నాట్యవిద్వన్మణి అనే బిరుదులతో సత్కరించారు. కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.లీనాచంద్ర, అకడమిక్ డీన్ రజనీకాంత్‌శుక్లా, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, వేదవేదాంగ డీన్ కృష్ణేశ్వర్, ఎస్సీసెల్ లైసన్ ఆఫీసర్ డాక్టర్ జేబీ చక్రవర్తి, ప్రభాకర్ రవిదాస్, ఆదర్శ్, సేతురామ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ నూతన బస్సుల ప్రారంభం



బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ మూడు నూతన బస్సులను బుధవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఇందులో బీఎస్-6 సాంకేతిక పరిజ్ఞానం, అధునాతన సదుపాయాలతో తయారైన రెండు ఎక్స్‌ప్రెస్ బస్సులు(50సీటింగ్ కెపాసిటీ), ఓ పల్లె వెలుగు(58సీటింగ్ కెపాసిటీ) బస్సులు ఉన్నాయి. అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేసిన అనంతరం పచ్చజెండా ఊపి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల పల్లెలకు ప్రజా రవాణా విస్తరణ, రోడ్ల మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన జిల్లా అధ్యక్షులు నరసింహయాదవ్, హరిప్రసాద్, ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

● కాణిపాకం-తిరుపతి ఎక్స్‌ప్రెస్ బస్సులు : కాణిపాకం-తిరుపతి మధ్య ఎక్స్‌ప్రెస్ బస్సులు తిరుగనున్నాయి. ఉద్యోగులకు అనుకూలంగా షెడ్యూల్స్ ఖరారు చేశారు.

● తిరుపతి-సత్యవేడు పల్లె వెలుగు : తిరుపతి-సత్యవేడు మధ్య పల్లె వెలుగు బస్సు తిరగనుంది. విద్యార్థులకు అనుకూలంగా షెడ్యూల్స్‌ను ఖరారు చేశారు. బస్టాండు, రేణిగుంట, గాజులమండ్యం, పుత్తూరు సిద్ధార్థ కాలేజీ, పిచ్చాటూరు, సత్యవేడుకు నడుస్తుంది.

రేపు విద్యుత్ అదాలత్

తిరుపతి(ఆటోనగర్) నవంబరు6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదాల సమస్యలను పరిష్కరించడానికి శుక్రవారం పాత తిరుచానూరు రోడ్డులోని విద్యుత్ డీఈ కార్యాలయంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నామని తిరుపతి టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి విశ్రాంత న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి, సభ్యులు కె.రామమోహనరావు, ఎస్.ఎన్.అంజనీకుమార్‌లు హజరవుతారని తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

నేడు ధర్మనిధి ఉపన్యాసం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ జర్నలిజం విభాగంలో డాక్టర్ సీవీఎస్ శర్మ ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం గురువారం నిర్వహించనున్నారు. హ్యూమానిటీస్ సెమినార్ హాల్లో ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది. యూఎస్ఏకు చెందిన ప్రొఫెసర్ సందీప్ ప్రసంగిస్తారు. ఫ్యాక్ట్స్, ఫిక్షన్, సైన్స్ అండ్ స్టోరీ టెల్లింగ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ట్రెండ్స్ ఇన్ మీడియా అండ్ కమ్యూనికేషన్ రీసెర్చ్ అంశంపై ఆయన ప్రసంగిస్తారని వర్సిటీ జర్నలిజం విభాగాధిపతి ప్రొఫెసర్ బీఎన్ నీలిమ తెలిపారు.

మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఎంపీ ల్యాడ్స్ కింద మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, గనులు, భూగర్భశాఖ అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో తెలుగుగంగ ఎస్ఈ మదనగోపాల్, పంచాయతీరాజ్ ఎస్ఈ రామ్మోహన్, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ పోటీల్లో సత్తా

తిరుపతి(క్రీడలు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలోని జువైనల్ బాలుర పరిశీలన, ప్రత్యేక గృహ సముదాయంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా బుధవారం నాలుగవ అంతర్జాతీయ ఆన్‌లైన్ చెస్ పోటీలు నిర్వహించారు. ఇక్కడి బాలురు ప్రతిభ కనబరిచి అంతర్జాతీయంగా రెండో స్థానం కైవసం చేసుకున్నారు. ఐదుగురు బాలురను, కోచ్‌లను ఐఓసీఎల్ ఈడీ బి.అనిల్‌కుమార్, డీజీఎం వి.కుమార్ ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఇక్కడి బాలురకు మరిన్ని ఆటల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఇన్‌చార్జ్ తిమ్మప్ప, షణ్ముగరావు, త్రినాథరావు, శరత్‌బాబు, సుదర్శన్‌రెడ్డి, మోహన్‌బాబు, శ్రీధర్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలకు చాందిని

తిరుచానూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలకు తిరుచానూరు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని చాందిని ఎంపికైనట్లు హెచ్ఎం మురళి తెలిపారు. 6వ తరగతి చదువుతున్న మోటుపల్లి చాందిని పులివెందులలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్టాఫ్ టెన్నిస్‌లో ప్రతిభ కనబరచిందని పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పీఈటీ సురేంద్రబాబు, కోచ్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం తిరుపతి-తిరుచానూరు రైల్వేస్టేషన్ మధ్య చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ విఠల్ నాయక్ వివరాల మేరకు.. మృతదేహం రైలు పట్టాలపై పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉంటుంది. గుండు కొట్టుకుని ఉన్నాడు. నలుపు తెలుపు గళ్ల ఫుల్ షర్టు, నసీం కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఇతర వివరాలు ఏమీ లేకపోవడంతో మృతదేహాన్ని తిరుపతి రుయాకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు 9440627638కు సమాచారమివ్వాలని కోరారు.

తిరుపతి ఎమ్మెల్యేని ప్రత్యేక ఆహ్వానితులుగా తీసుకోవాలి

జనసేన నేత నరసింహులు నాయుడు



తిరుపతి, నవంబరు6(ఆంధ్రజ్యోతి) : టీటీడీ పాలకమండలిలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును ప్రత్యేక ఆహ్వానితులుగా తీసుకోవాలని జనసేన సీనియర్ నేత, రాష్ట్ర ఉద్యోగ సంఘాల మాజీ నాయకుడు ఎం.నరసింహులు నాయుడు కోరారు. తిరుపతిలో ప్రోటోకాల్ అంశంతో పాటు స్థానిక పరిస్థితుల దృష్ట్యా తిరుపతి ఎమ్మెల్యేని టీటీడీ పాలకమండలిలో కొనసాగించాలన్నారు. రాయలసీమ జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా తిరుపతి నియోజకవర్గంలో కూటమి పార్టీలో బహునాయకత్వ సమస్య తీవ్రంగా ఉందని, ఈ పరిణామంతో అధికారుల్లో గందరగోళం నెలకొనే అవకాశం ఉందని అన్నారు. హిందువుగా ఉండే తిరుపతి ఎమ్మెల్యేకి టీటీడీ పాలకమండలిలో చోటు దక్కితే నగర అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందన్నారు. గతంలో ఇచ్చిన జీవోను కొనసాగించి పాలకమండలిపై నెలకొన్న అనిశ్చితికి తెరదించాలని విజ్ఞప్తి చేశారు.



పనబాక లక్ష్మికి సన్మానం

తిరుపతి, నవంబరు6(ఆంధ్రజ్యోతి) : టీటీడీ పాలకమండలి సభ్యులుగా నియమితులై బుధవారం తిరుపతికి వచ్చిన కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మిని టీడీపీ నేతలు మబ్బు దేవనారాయణ రెడ్డి, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణలు శాలువా, శ్రీవారి చిత్రపటంతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్వీఎం శ్రీధర్, సుబ్బు యాదవ్, కరాటే చంద్ర, మస్తాన్ నాయుడు, జగ్గ, రవితేజ నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, షైనం సురేష్, దేవ, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాస్ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కిశోర్ వికాస్ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో ఆయన సమీక్ష నిర్వహిచారు. పోషకాహార లోపం నివారణ దిశగా కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ పనితీరు, బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. తెలిపారు. బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమాధికారిణి జయలక్ష్మి, డీసీపీవో శివశంకర్ పాల్గొన్నారు.

జిల్లాను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతాం

శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు



కలెక్టర్ వెంకటేశ్వర్‌తో సమావేశమైన శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్‌తో కలిసి బుధవారం ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి క్రీడలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో వరల్డ్ క్లాస్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి 32 ఎకరాల స్థలం అవసరమవుతుందని తెలిపారు. జిల్లాలో క్రీడా రంగం అభివృద్ధికి సెస్ నిధులు, అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ క్రీడా పాలసీని పటిష్టంగా అమలు చేసి, తిరుపతిని క్రీడా వేదికగా రూపొందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఎస్‌డీఓ సయ్యద్ సాహెబ్ పాల్గొన్నారు.

టీటీడీ సభ్యుల ప్రమాణ స్వీకారం

తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం టీటీడీ చైర్మన్‌తో పాటు మరో 15 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణం చేసిన సభ్యులు..


బి.మహేంద్రరెడ్డి


అనుగోలు రంగశ్రీ


తమ్మిశెట్టి జానకీదేవి


వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


అదిత్ దేశాయ్


బి.ఆనంద్‌సాయి


జంగా కృష్ణమూర్తి


జాస్తి పూర్ణసాంబశివరావు


ఎం.శాంతారాం


మల్లెల రాజశేఖర్‌గౌడ్


ఎంఎస్ రాజు


నన్నూరి నర్సిరెడ్డి


ఆర్ఎన్ దర్శన్


నరేష్‌కుమార్


పి.రామమూర్తి

విద్యార్థుల సేద్యం

● పద్మావతి, ఎస్వీయూల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న పీజీ విద్యార్థులు


ఎస్వీయూ గ్రీన్‌టీం




పద్మావతి వర్శిటీ గ్రీన్‌టీం

పుస్తకం పట్టిన చేతులే పారా పలుగూ అందుకుంటున్నాయి. ల్యాబరేటరీల్లో పరిశోధనలు చేసే విద్యార్థులు, మట్టిలో విత్తనాలు నాటి, కలుపు తీసి, కూరగాయలు పండించి వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్శిటీ, శ్రీవేంకటేశ్వర యూనివర్శిటీల విద్యార్థులు సేంద్రియ వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. యూనివర్శిటీల ప్రాంగణంలోనే పాలేకర్ స్ఫూర్తిగా కూరగాయలు సాగు చేస్తున్నారు. వర్ద్ సంస్థ వ్యవస్థాపకుడు గంగాధరం నేతృత్వంలో విద్యార్థులు గ్రీన్‌టీం లుగా ఏర్పడి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో పనుల్లో సందడి చేస్తున్నారు.

ప్రత్యేక కథనం - తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

20 అడుగుల నేల వారి ప్రయోగ క్షేత్రం

ప్రకృతి వ్యవసాయ ప్రయోగశాలకు ఈ రెండు యూనివర్శిటీల విద్యార్థులు కేటాయించుకున్న నేల.. కేవలం 20 చదరపు అడుగులు మాత్రమే. ఒక కుటుంబం ఏడాది పొడవునా ఆరోగ్యకరమైన కూరగాయలు పండించుకోవడానికి ఈ తావు చాలు అంటారు గంగాధరం. పద్మావతిలో 20 మంది విద్యార్థినులు, ఎస్వీయూలో 20 మంది రెండు గ్రీన్ టీంలుగా ఏర్పడ్డారు. తమ ప్రాంగణాల్లో ప్రయోగ క్షేత్రాన్ని సిద్ధం చేసుకున్నారు. మడులుగా మలచుకుని విత్తనాలు నాటారు. ఇప్పుడవి కాపుకొచ్చాయి. తమ చేతులతో నాటి నీళ్లు పోసి పెంచిన మొక్కలు కాసిన నవనవలాడే కూరగాయలను చూసి వారు మురిసిపోతున్నారు.

సొంతంగా ఎరువులు


విద్యార్థులకు మొక్కల పోషణ గురించి వివరిస్తున్న గంగాధరం

పూర్తిగా సేంద్రియ పద్ధతిలో చేస్తున్న సేద్యం ఇది. దేశీయ విత్తనాలే నాటుతున్నారు. వంగ, బెండ, సొర, బీర, మిరప, టమోటా,మొక్క జొన్న, బీన్స్ వంటి కాయగూరలు ఈ క్షేత్రాల్లో ఉన్నాయి. తోటకూర, సిరికూర, పాలకూర, చుక్కకూర, గోంగూర వంటి ఆకుకూరలున్నాయి. సస్యరక్షణలో భాగంగా బంతి పూల మొక్కలు నాటారు.అంతర పంటగా మొక్కజొన్న నాటారు. చిక్కుడు, సొర, బీర వంటి తీగజాతి మొక్కలు ఒక పక్కగా నాటారు. రసాయన ఎరువులు వాడడం లేదు. జీవామృతం, వేప కషాయం, ఆవు పేడ, మూత్రం, శనగ పిండి, పుట్టమట్టితో తామే ఎరువులు తయారు చేసుకుని ఈ పంటలకు అందిస్తున్నారు.



ఈ అనుభూతి అద్భుతం

రసాయనాల అవశేషాలు లేని ఆహారం తింటే ఆరోగ్యంగా ఉంటాం. సేంద్రియ పద్ధతిలో మేం పండిస్తున్న కూరగాయలు, ఆకుకూరలు ఆరోగ్యకరమైనవి. సహజ ఎరువులే వాడుతున్నాం. మా యూనివర్శిటీలో మా చేతులతో కూరగాయలు పండిస్తున్న అనుభూతి అద్భుతంగా ఉంది.

- డి. ప్రియాంక,
ఎమ్మెస్సీ జువాలజీ సెకండియర్, పద్మావతి వర్సిటీ

ప్రకృతి సేద్యంపై పరిశోధన

పీజీ తర్వాత సహజ సిద్ధంగా లభించే ఆహార పదార్థాల్లోని పోషక విలువలపై పరిశోధన చేయాలనే ఆలోచనతో ఉన్నా. మా యూనివర్శిటీలోని ఈ ప్రయోగ క్షేత్రంలో పనిచేయడం ప్రాథమిక పరిశోధనలా ఉంది. చాలా సంతోషంగా ఉంది.

-ఎం. పల్లవి, ఎమ్మెస్సీ హోం సైన్స్ ఫుడ్ టెక్నాలజీ సెకండియర్, పద్మావతి వర్సిటీ



చీడపీడలపై యుద్ధం

వ్యవసాయంలో చీడపీడలను ఎదుర్కోవడం పెద్ద సవాలు. రసాయన మందులు చల్లి సులువుగా వీటిని నివారిస్తున్నారు. అయితే వీటి అవశేషాలు మిగిలిపోయి మనం ఆహారంగా తీసుకున్నపుడు అనేక రోగాలకు కారణంగా మారుతున్నాయి. ఇందుకు విరుగుడుగా ఈ రెండు యూనివర్శిటీల్లో సేంద్రియ పద్ధతిలోనే చీడపీడలపై యుద్ధం చేస్తున్నారు. ముందుగా బీజామృతంతో విత్తనశుద్ధి చేసుకుని నేలలో నాటుతారు. ప్రతి 15 రోజులకోసారి జీవామృతం నీటిలో కలిపి మొక్కలకు పారిస్తారు. ఇది మంచి పోషకాలను ఇస్తుంది. మట్టిలో ఘనజీవామృతం చల్లడం ద్వారా వానపాములు, జీవరాశులు వ్యాప్తి చెంది పంట భూమి సారవంతమవుతుంది. చీడపీడలు ఆశించకుండా వేపాకు, గోమూత్రం, ఆవుపేడతో చేసిన నీమాస్త్రం పిచికారీ చేస్తున్నారు. పురుగు ఆశిస్తే.. వేప, ఉమ్మెత్త, సీతాఫలం, పల్లేరు ఆకుల జిగురును ఆవు మూత్రంలో ఉడికించి తయారుచేసుకున్న బ్రహ్మాస్త్రం పిచికారీ చేస్తారు. ఎంతకీ లొంగని చీడను అగ్నాస్త్రంతో ఎదుర్కొంటున్నారు. మిరపకాయలు, వెల్లుల్లి, పొగాకు, ఆవుమూత్రంతో దీనిని తయారు చేసుకుంటున్నారు. ఆకుముడత పురుగు, కాండం తొలుచు పురుగు, కాయ తొలుచు పురుగు, వేరు పురుగు నివారణకు దీనిని వాడుతున్నారు.

ఒత్తిళ్లన్నీ మరచిపోతున్నాం

మేం చదువుకునే చోటే ఆకుకూరలు, కూరగాయలు, పూలు పండిస్తున్నాం. చదువుకుంటూనే, స్నేహితులతో కలిసి యూనివర్సిటీలోనే వ్యవసాయ పనులు చేస్తూ ఉండటం చెప్పలేని ఆనందాన్ని ఇస్తూ ఉంది. చదువుల్లో ఉన్న ఒత్తిడినంతా పచ్చని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని చూసిన వెంటనే మాయమై పోతూ ఉంది.

- ఖలీద్,
ఎమ్మెల్సీ బోటనీ సెకండియర్, ఎస్వీయూ

మా పల్లె రైతులనూ మారుస్తా

క్లాసుల్లేని సమయంలో ఇలా సేద్యం పనులు చేయడం చాలా బావుంది. ప్రతి శుక్ర, శని వారాల్లో గ్రీన్ టీం ఆధ్వర్యంలో కలుపు తీయడం, నీళ్ళు కట్టడం చేస్తున్నాం. ఈ అనుభవంతో మా ఊరిలోనూ రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు నడిపించాలని అనిపిస్తుంది.

- రూపేష్ కుమార్,
ఎమ్మెస్సీ బోటనీ సెకండియర్, ఎస్వీయూ







అఖిలాండం వద్ద కర్పూరం వెలిగిస్తున్న సాయిధరమ్ తేజ్ - క్యూలో సప్తగిరి - ఆలయం ముందు స్నేహారెడ్డి

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

తిరుమల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. సుప్రభాతసేవలో హీరో సాయిధరమ్ తేజ్, అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి పాల్గొన్నారు. సుప్రభాత పఠనం అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో నటులు సప్తగిరి, రఘు, దగ్గుబాటి అభిరామ్, దర్శకుడు అట్లూరి వెంకటేశ్వరరావు, నిర్మాత సంతోష్ కూడా స్వామిని దర్శించుకున్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఇద్దరు డిగ్రీ విద్యార్థులపై హత్యాయత్నం

● ఒకరి పరిస్థితి విషమం


చికిత్స పొందుతున్న విష్ణువర్ధన్

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు డిగ్రీ విద్యార్థులపై గుర్తు తెలియని వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని చెన్నై రోడ్డు సమీపంలో ఉన్న ఈదులగుంట వద్ద కలకలం రేపింది. బుచ్చినాయుడుకండ్రిగ మండలం నెలవాయి గ్రామానికి చెందిన విష్ణువర్ధన్, శ్రీకాళహస్తి పట్టణం తెట్టు ప్రాంతానికి చెందిన వాసు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఇద్దరూ సాయంత్రం చెన్నై రోడ్డులోని సాయిబాబా ఆలయం సమీపంలో నిలబడి ఉండగా గుర్తు తెలియని వ్యక్తి కత్తితో వారిపై విరుచుకుపడ్డాడు. దీంతో విష్ణువర్ధన్ తీవ్రంగా, వాసు స్వల్పంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న కొందరు గమనించి యువకులను ఆటోలో శ్రీకాళహసి పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ విష్ణువర్ధన్‌కు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. స్వల్ప గాయాలతో బయటపడ్డ వాసు స్థానిక ప్రైవేటు వైద్యశాలకు చికిత్స నిమిత్తం వెళ్లాడు. కాగా సాయిబాబా ఆలయం వద్ద కత్తితో దాడికి పాల్పడిన సమయంలో స్థానికులు హడలిపోయారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రి అత్యవసర విభాగం వద్ద రక్తపు మరకలను చూసి రోగులు, వారి బంధువులు ఉలిక్కిపడ్డారు. ఈ ఘటనపై టూ టౌన్ సీఐ వెంకటేశ్వర్లును వివరణ కోరగా... తాము ఆస్పత్రికి చేరుకునేలోగా క్షతగాత్రులు చికిత్స నిమిత్తం వెళ్లిపోయారన్నారు. విచారణ చేస్తున్నామని తెలిపారు.



ఈ స్థలంలోకి ప్రవేశిస్తే..!

● శిక్షార్హులంటూ జగనన్న లే అవుట్‌లో హెచ్చరిక బోర్డు

రేణిగుంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'ఈ స్థలం కోర్టులో ఉన్నది. ఇందులో ప్రవేశించే వారు శిక్షకు అర్హులు' అంటూ జగనన్న లే అవుట్‌లో హెచ్చరిక బోర్డు వెలిసింది. ఇది లబ్ధిదారులను ఆందోళనకు గురిచేస్తోంది. రేణిగుంట మండలం జీపాళెం పంచాయతీ కుర్రకాలువ సమీపంలోని పద్మానగర్‌లో వైసీపీ ప్రభుత్వంలో జగనన్న లే అవుట్‌ను ఏర్పాటు చేసి పలువురికి ఇంటి స్థలాలను కేటాయించారు. ఇళ్ల స్థలాలకు పోను ఉద్యానవనం కోసం ఎకరా వదిలిపెట్టారు. ప్రస్తుతం పలువురు ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ నేపథ్యంలో కోర్టు వివాదమంటూ బుధవారం హెచ్చరిక బోర్డు పెట్టడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురయ్యారు. ఈ బోర్డులో ఉన్న నెంబరుకు ఫోను చేయగా కొత్తపాళేనికి చెందిన సుబ్రమణ్యంగా తెలిసింది. 'నలభై ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ హయాంలో రైతులకు వ్యవసాయ భూములను పంపిణీ చేసి పట్టాలిచ్చారు. ఇందులో మా తల్లి నాగభూషణం పేరిట భూమి ఉంది. ఇక్కడ వైసీపీ ప్రభుత్వం జగనన్న లే అవుట్ ఏర్పాటుకు భూసేకరణ చేసి ఎకరాకు రూ.32లక్షల పరిహారం ఇచ్చింది. మా భూమికి ఎటువంటి పరిహారం ఇవ్వకుండా రెండేళ్లుగా తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిప్పించుకున్నారు. దీంతో కోర్టును ఆశ్రయించాను' అని సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ విషయమై తహసీల్దారు శ్యామ్‌ప్రసాద్‌ను వివరణ కోరగా.. హెచ్చరిక బోర్డు విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వీఆర్వోతో విచారణ జరిపించినట్లు తెలిపారు. కోర్టు ఉత్తర్వులుంటే తమకు చూపించాలని లేనిపక్షంలో ఆ బోర్డును తొలగిస్తామని స్పష్టం చేశారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు ప్రవేశ పరీక్షను పక్కాగా నిర్వహించండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 6: ఉచిత మెగా డీఎస్సీ కోచింగ్‌కు ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఈ ప్రవేశ పరీక్ష నిర్వహణపై బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ, గిరిజనశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 10వ తేది ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తిరుపతిలోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల, కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల, పుత్తూరు సమీపంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు వివరించారు. అభ్యర్థులు తమ హాల్‌టిక్కెట్లను 'జ్ఞానభూమి' పోర్టల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ప్రత్యేక హెల్ప్ లైన్ నెంబరు 70130 08498ను సంప్రదించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను అధికారులు కల్పించాలని ఆదేశించారు. ఉచిత శిక్షణ కోసం జిల్లా నుంచి 539 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు చెన్నయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టూరిజం డీవీఎంగా శ్రీనివాసరావు


నూతన డీవీఎంను పరిచయం చేసుకుంటున్న టూరిజం ఉద్యోగులు

తిరుపతి అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ జిల్లా డివిజనల్ మేనేజర్‌గా సీహెచ్ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఉన్న గిరిధర్‌రెడ్డిని మాతృసంస్థ(ఆర్టీసీ)కు బదిలీ చేశారు. నెల్లూరు డీవీఎంగా ఉన్న శ్రీనివాసరావును తిరుపతికి బదిలీ చేశారు. బుధవారం ఉదయం జూపార్కు రోడ్డులోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఆయన్ను మర్యాదపూర్వకంగా కలసి పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సమన్వయంతో పని చేసి సంస్థ ఆదాయానికి, అభివృద్ధికి ప్రాధాన్యత ఇద్దామని కోరారు.

సదరన్ డిస్కం బోర్డు లీగల్ కౌన్సిల్‌గా మధుసూదన రెడ్డి



తిరుపతి(ఆటోనగర్)నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ తిరుపతి బోర్డు లీగల్ కౌన్సిల్‌గా ఎన్.మధుసూదన రెడ్డిని నియమిస్తూ బుధవారం డిస్కం సీఎండీ కె.సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. మధుసూదన్ రెడ్డి తిరుపతి ఆపరేషన్ టౌన్ డివిజన్‌లో బోర్డు లీగల్ కౌన్సిల్‌గా విధులు నిర్వహిస్తారు. 2027 అక్టోబరు 31 వరకు ఆయన మూడేళ్ల పాటు విధులు నిర్వహిస్తారు.


దక్షిణామూర్తి సన్నిధిలో హుండీ లెక్కింపు

ముక్కంటి ఆలయ హుండీ లెక్కింపు

● 40 రోజుల్లో రూ.1.94 కోట్ల ఆదాయం

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురు దక్షిణామూర్తి సన్నిధిలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. రూ. 1,94,41,581 నగదు హుండీ ద్వారా వచ్చింది. ఇక బంగారం 85.100 గ్రాములు, వెండి 607.10 కిలోలు, ఇతర దేశాలకు చెందిన 145 నోట్లు విదేశీ నగదు వచ్చింది. సెప్టెంబరు 25వ తేదీన చివరిగా హుండీ లెక్కింపు జరిగింది. 40 రోజుల తర్వాత బుధవారం జరిగిన లెక్కింపులో వచ్చిన ఆదాయం 1.94 కోట్లుగా అధికారులు ప్రకటించారు.

నేడు రెండు సబ్ స్టేషన్లకు శంకుస్థాపన

● వర్చువల్‌గా భూమిపూజ చేయనున్న సీఎం చంద్రబాబు

తడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి గురువారం ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు వర్చువల్‌గా భూమిపూజ నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 సబ్ స్టేషన్ల నిర్మాణ శంకుస్థాపనలో భాగంగా తడ మండలం మాంబట్టు, రేణిగుంట మండలం తూకివాకంలో రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు భూమిపూజ జరగనుంది. ఇందులో మాంబట్టు సబ్ స్టేషన్‌కు రూ.43.50 కోట్లు, తూకివాకం సబ్‌స్టేషన్‌కు రూ.76.89 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు గురువారం సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరు 220 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్‌గా మంగళగిరిలో శంకుస్థాపన చేసిన అనంతరం ఇక్కడ జిల్లా జాయింట్ కలెక్టర్ శుభంబన్సాల్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా భూమిపూజకు ఏర్పాట్లు చేశామని ట్రాన్స్‌కో డీఈ బలరామమూర్తి తెలిపారు.

పుత్తూరు వార్తలు

బెల్టు దుకాణాలపై ఉక్కుపాదం

● ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్



మద్యం దుకాణదారులకు సూచనలిస్తున్న విజయశేఖర్

పుత్తూరు అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ఏ చర్యనైనా ఉపేక్షించబోమని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ వి విజయ శేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మద్యం దుకాణదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బెల్టు షాపుల విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. సారా, ఇతర రాష్ట్రాల మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నాణ్యమైన మద్యం ఎమ్మార్పీకే అందించాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ధరల పట్టికను తప్పక ప్రదర్శించాలని సూచించారు. లైసెన్సుదారులు బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నట్లు విచారణలో తేలితే లైసెన్సుదారుడిపై చర్యలతో పాటూ దుకాణాలను సస్పెండ్ చేస్తామన్నారు. ప్రతి దుకాణం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏరియల్ సర్వే ఆధారంగా నిబంధనలు అనుసరణ ఉంటుందన్నారు. మిలటరీ క్యాంటీన్ లిక్కర్‌ను విక్రయిస్తున్నారని, కొనుగోలు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. విక్రేతల గుర్తింపు రద్దుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ, కర్ణాటక, తమిళనాడు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు ఇతర రాష్ట్రాల మద్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారన్నారు. ఇలా చాలా కేసులు నమోదయ్యాయని తెలిపారు. దుకాణదారులు మాట్లాడుతూ... మద్యం విక్రయాల నోటిఫికేషన్‌లో సూచించిన 20 శాతం మార్జిన్ రావడం లేదని వాపోయారు. అంతేకాకుండా డిమాండ్‌కు అనుగుణంగా స్టాక్ ఇవ్వడం లేదన్నారు. రూ.99, రూ.120 బ్రాండ్ల పంపిణీ లేకపోవడంతో చాలా మంది పక్కరాష్ట్రాల వైపు చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ మురళి మోహన్, ఎస్ఐలు అంజాద్ బాషా, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని తరలించండి: వామపక్షాలు

నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన మద్యం దకాణాన్ని తరలించాలని సీపీఐ, సీపీఎంలు డిమాండ్ చేశాయి. పుత్తూరు ఎక్సైజ్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్‌కు ఈ మేరకు కలిసి వినతిపత్రం అందించాయి. ఈ సందర్భంగా వామపక్షాల నాయకులు మాట్లాడుతూ.. ఎల్ఐసీ ఆఫీస్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణానికి అతి సమీపంలో పలు విద్యాసంస్థలు, కోర్టు భవనం ఉన్నాయన్నారు. అంతే కాకుండా పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో నడి రోడ్డుపై వాహనాలు నిలిపి మద్యం కొనుగోలు చేస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదన్నారు. సమస్యను పరిష్కరించాలంటూ సీఐ మురళిని డిప్యూటీ కమిషనర్ ఆదేశించారు.

● సమగ్ర ఇంటింటా గణన ప్రక్రియతో

యువతకు ఉపాధి అవకాశాలు

● మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్

పుత్తూరు అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వారిలోని నైపుణ్యాలను తెలుసుకునేందుకే ఇంటింటా గణన ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కార్యాలయంలో సచివాలయం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న వారి వివరాలు సేకరించాలన్నారు. విద్యార్హతలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులు, ప్రస్తుతం ఉపాధి వివరాలు, నైపుణ్యాల తదితర సమాచారం సేకరించాలని వివరించారు. ప్లేస్టోర్‌కు వెళ్లి నైపుణ్య యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, అందులో కూడా వివరాలు నమోదు చేసుకునే వెసలుబాటుయు పౌరులకు కల్పించామన్నారు. మున్సిపల్ మేనేజర్ మణిశంకర్, సీనియర్ అసిస్టెంట్ రియాజ్ బాషా, శిక్షకులు హేమనాథ్, ధనశేఖర్, కార్తీక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు వెట్రిసెల్వన్



పుత్తూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు వెట్రిసెల్వన్ ఎంపికయ్యాడు. ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 వాలీబాల్ బాలుర జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనపరిచిన పరమేశ్వరమంగళం ఉన్నత పాఠశాల విద్యార్థి వెట్రి సెల్వన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర శెట్టి తెలిపారు. జిల్లాస్థాయి పోటీలు ఇటీవల మదనపల్లెలో జరిగాయన్నారు. ఈనెలలో విజయనగరం జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా వెట్రిసెల్వన్‌కు క్రీడా దుస్తులను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షుడు మణికంఠ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షం



పుత్తూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సాయంత్రం 6 గంటలకు అరగంట పాటు వర్షం కురిసింది. గాలి వీచకుండా వాన కురవడంతో రోడ్ల మీద నీరు ప్రవహించింది. దీంతో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి చల్ల బడింది. సుమారు 15 మిల్లీమీటర్ల వర్షం కురిసింది

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా



లక్ష్మీపురంలో సభ్యత్వ నమోదు

వడమాలపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సభ్యత్వంతో కార్యకర్తలకు టీడీపీ భరోసా కల్పిస్తోందని పార్టీ చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి ధనంజయులునాయుడు చెప్పారు. మండలంలోని లక్ష్మీపురంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్లు ప్రకాష్, దయాళన్, బీసీ సాధికార కమిటీ జిల్లా కన్వీనర్ ఉమాపతి రావు, నాయకులు చిరంజీవి, భాస్కర్‌నాయుడు, రవినాయుడు, సుబ్రమణ్యంనాయుడు, శివయ్య, ప్రభావతి, మునీశ్వరమ్మలు పాల్గొన్నారు.

హత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

వడమాలపేట, నవంబర్ 6(ఆంధ్రజ్యోతి): గిరిజన బాలిక హత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షేంచేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ చెప్పారు. మండలంలోని ఏఎం పురం ఎస్టీ కాలనీలో ఇటీవలన హత్యాచారానికి గురైన చిన్నారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ధైర్యం చెప్పారు. బతుకు తెరువుకోసం ఉద్యోగం కల్పించాలని, కేవీబీపురంలో ఇట్లు కట్టించాలని కుటుంబీకులు కోరగా కలెక్టర్‌కు నివేదిక పంపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. డీఎస్పీ రవికుమార్, ఎస్ఐ ధర్మారెడ్డి, ఎంపీడీవో శేషగిరిరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు నెల్లూరు మెమో రైళ్లు రద్దు

తడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు వెళ్లే మెమో రైళ్లను గురువారం సదరన్ రైల్వే అధికారులు రద్దు చేశారు. సూళ్లూరుపేట సమీపంలోని కాళంగినదిపై పనుల జరుగుతున్న కారణంగా నెల్లూరు వైపు వెళ్లే డౌన్‌లైన్‌లో బుధవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు రైళ్ల రాకపోకలను నిలిపివేయనున్నారు. ఉదయం 7.55 నిమిషాలకు సూళ్లూరుపేట నుంచి నెల్లూరు వైపు వెళ్లే మెమో రైలు, ఉదయం 10.20 నిమిషాలకు నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు వచ్చే మెమో రైలును పూర్తిగా రద్దు చేశారు. అలాగే చెన్నై - సూళ్లూరుపేట మధ్య నడిచే పలు లోకల్ రైళ్లు రద్దుకాగా, మరికొన్ని లోకల్ రైళ్లను ఎలావూరు, సూళ్లూరుపేట మధ్య రద్దుచేశారు. గురువారంతో పాటు ఈ నెల 9వ తేదీ శనివారం, 12వ తేదీ మంగళవారం సైతం ఈ రైళ్లు రద్దు కానున్నాయని సదరన్ రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

రియల్టర్‌పై అట్రాసిటీ కేసు

దొరవారిసత్రం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన రియల్టర్ గుత్తా రవీంద్రనాయుడుపై అట్రాసిటీ కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.... మండలంలోని బూదూరు గ్రామానికి చెందిన వరలక్ష్మి భూమికి కాపలాదారుగా ఉన్న తనను రవీంద్రనాయుడు కులం పేరుతో దూషించారని అదే గ్రామానికి నెలబల్లి చంద్రయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రవీంద్రనాయుడుపై బుధవారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అజేయ్‌కుమార్ తెలిపారు.

రక్తదాన శిబిరం

గూడూరు అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో శ్రీహరిబాబు, అజయ్, గాంధీ, హరిబ్రహ్మ, చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.





పెసలగుర్రప్ప తోట వద్ద అండర్‌పాస్ లేకపోవడంతో జాతీయ రహదారి దాటుతున్న స్కూల్‌వ్యాన్లు, ప్రయాణికులు

పల్లెకు పోయే దారేదీ..?

హైవే నిర్మాణంతో కనుమరుగవుతున్న లింకు రోడ్లు

సర్వీస్ రోడ్లు లేక రాకపోకలకు ఇక్కట్లు

పెళ్లకూరు నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు నిర్మాణంలో ఉన్న ఆరు వరుసల జాతీయ రహదారితో పెళ్లకూరు మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు దారి సౌకర్యం కనుమరుగవుతోంది. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు నాయుడుపేట, శ్రీకాళహస్తి, తిరుపతి పట్టణాలకు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గతంలో ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు నాయుడుపేట - తిరుపతి రహదారిని కలుపుతూ లింకు రోడ్లు ఉండేవి. ప్రస్తుతం జాతీయ రహదారి నిర్మాణంలో సర్వీస్ రోడ్లు పూర్తి స్థాయిలో నిర్మించకపోవడంతో గ్రామాల్లోకి వెళ్లేందుకు ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న గ్రామాల్లోకి వెళ్లాలంటే కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. తాళ్వాయిపాడు, చావాలి, చిల్లకూరు, పెళ్లకూరు, టెంకాయతోపు, నెలబల్లి గ్రామాల వద్ద అండర్ పాస్‌లకు ఇరువైపులా సర్వీస్ రోడ్ల నిర్మాణంలోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. మండలంలో సుమారు 18 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఇరువైపులా విస్తరించి ఉన్న 14 గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. దీంతో పలు గ్రామాల్లోకి వెళ్లేందుకు ప్రజలు పడుతున్న ఇక్కట్లు అన్నీఇన్నీ కావు.

11 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు

71వ జాతీయ రహదారిపై ఉన్న పెసల గుర్రప్పతోట నుంచి కప్పగుంటకండ్రిగ, పాలచ్చూరు తదితర 11 గ్రామాలకు వెళ్లే దారి వద్ద అండర్ పాస్ నిర్మించకపోవడంతో ప్రజలు నరక యాతన ఇబ్బందులు పడుతున్నారు. ఇదే దారిలో నిత్యం వందలాది మంది కార్మికులు మేనకూరు సెజ్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. అండర్‌పాస్ లేకపోవడం, కనీసం సర్వీస్ రోడ్డు నిర్మించపోవడంతో ఆయా గ్రామాల ప్రజల ఇక్కట్లు చెప్పనలవికావు. దగ్గర్లోనే ఉన్న మండల కేంద్రానికి చేరుకోవాలన్నా కిలోమీటర్ల దూరం అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి అండర్ పాస్‌ల వద్ద ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, అదేవిధంగా తాళ్వాయిపాడు నుంచి నెలబల్లి రోడ్డు వరకు జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పంట పొలాలకు దారిలేదు

మండలంలో 20వేల ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా ఏడాదికి రెండు పంటలు పండే భూములు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్నాయి. ఈ భూముల్లో పంటలు వేసేందుకు విత్తనాలు, ఎరువులు తీసుకెళ్లేందుకు... సాగుచేసి పండించిన ఉత్పత్తులను ఇళ్లకు చేర్చుకునేందుకు రోడ్డు సౌకర్యం లేక రైతులు పడుతున్న పాట్లు వర్ణనాతీతం.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారావు

గూడూరు, సూళ్లూరుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి మోసపోకుండా వుండాలని హైదరాబాదుకు చెందిన సైబర్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ నరసింహారావు అన్నారు. బుధవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోతోందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని కొందరు దుర్వినియోగం చేస్తూ సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. డీఎస్పీ రమణకుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలను నియంత్రించేందుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మొబైల్ మేసేజ్‌లు, ఆన్‌లైన్ ద్వారా సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. లోన్లు మంజూరయ్యాయని, ఇతర రకాలుగా ఆశ చూపించి మన బ్యాంకు ఖాతా నంబర్లును తెలుసుకుని మోసాలకు పాల్పడుతున్నారన్నారు. తెలియని వ్యక్తులు ఫోన్, లేదా మేసేజ్ ద్వారా ఓటీపీలు, బ్యాంకు ఖాతా నంబర్లు అడిగితే వివరాలు చెప్పకూడదన్నారు. అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది నగదు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్, సీఐలు కిషోర్‌బాబు, శేఖర్‌బాబు, హాస్సేన్‌బాషా, శ్రీనివాస్, ఎస్ఐ మనోజ్‌కుమార్, పవన్‌కుమార్, సురేష్‌బాబు, సుబ్రహ్మణ్యంరాజు, ఏవో కొండారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. ● సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ నిపుణుడు ఎల్.నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులు ఆన్‌లైన్, డిజిటల్ ప్రాడ్స్, లోన్ యాప్‌లు, స్మార్ట్ మొబైల్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు, ప్రిన్సిపాల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న విమల

గూడూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అత్తిలి విమల అన్నారు. బుధవారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో ఏఐఎస్ఎఫ్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం చట్టాలు ఎన్ని ఉన్నా అవి సక్రమంగా అమలు జరగడంలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడో ఒక దగ్గర ప్రతిరోజూ మహిళలపై అఘాయిత్యాలు, హత్యలు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల చిన్నారులపై లైంగిక దాడులు, హత్యలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో శశికుమార్, యశ్వంత్, సాయి, ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ హనుమంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

సూళ్లూరుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు తనకు సన్మానాలు, సత్కారాలకు బదులుగా అందజేసిన నోటు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, రమేష్, ఏజీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి



సభ్యత్వ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే

సూళ్లూరుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం కచ్చేరివీధిలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆధ్వ ర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ ప్రతి బూత్‌లో కార్యకర్తలకు సభ్యత్వ నమోదు చేయించే బాధ్యత ఆయా బూత్ కన్వీనర్లదేనని అన్నారు. కార్యకర్తలకు పార్టీ సభ్యత్వ నమోదు చేయించడం వల్ల బీమాతో పాటు ఇతర ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి ఏజీ కిషోర్, నాయకులు మాధవ నాయుడు, అలవల శ్రీనివాసులు, పార్థసారధి, బండారు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తిన్నెలపూడిలో రీ సర్వే గ్రామసభ

కోట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి సచి వాలయంలో బుధవారం తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో భూ ముల రీసర్వేపై గ్రామసభ జరిగింది. పంచాయతీలోని గ్రామాల రైతులు సమస్యలను అధికారుల దృష్టికి తీసు కెళ్లారు. కొన్ని సమస్యలను రెవెన్యూ అధికారులు అక్కడిక్కడే పరిష్కరిం చారు. కార్యక్రమంలో తెలుగు మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు గండ వరం సుష్మారెడ్డి, ఆర్ఐ మధుబాల, సర్వేయర్ గోపిరెడ్డి, పలువురు సర్వేయర్లు, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

సూళ్లూరుపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించు కొన్న తడ మండలం గొల్లల మొలువు గ్రామానికి చెందిన గోపాలరెడ్డికి ముఖ్య మంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.1,38,500 చెక్కును టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అశోక్ రెడ్డి, వేనాటి జనార్దన్ రెడ్డి, రాజారెడ్డి, కాటి సుబ్రహ్మణ్యం, కేవీరెడ్డి, విజయలక్ష్మి, మంజుల, చంద్రయ్య, సుబ్బయ్య పాల్గొన్నారు.

అదుపుతప్పి టిప్పర్ బోల్తా

గూడూరు అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు సమీపంలో బుధవారం ఓ టిప్పరు అదుపుతప్పి పొలాల్లోకి బోల్తాపడింది. స్థానికుల వివరాల మేరకు... తిప్పవరప్పాడు నుంచి గూడూరు వైపు కంకర లోడుతో వెళ్తున్న టిప్పరు చెన్నూరు సమీపంలో అదుపుతప్పి పొలాల్లో బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కి స్వల్ప గాయాలయ్యాయి. అదేవిధంగా పోటుపాళెం జాతీయ రహదారి కూడలి వద్ద చెన్నై వైపు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న ఓ మినీలారీ అదుపుతప్పి సర్వీసు రోడ్డులోకి దూసుకెళ్లింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

కల్యాణ్‌రెడ్డికి నేతల శుభాకాంక్షలు



కల్యాణ్‌రెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, కేఆర్ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు వేలూరు కల్యాణ్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం మండలంలోని శిరసనంబేడు గ్రామంలో అట్టహాసంగా జరిగాయి. గ్రామంలోని సిద్దేశ్వరస్వామి ఆలయంలో టీడీపీ కార్యకర్తల నడుమ కల్యాణ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. పేదలకు దుస్తులు, పండ్లు, విద్యార్థులకు విద్యా సామాగ్రి అందజేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, సర్పంచు గుంటపూడి పెంచలయ్య, సుధాకర్‌రెడ్డి, కుంపటి సునీల్, సిసింద్రి తదితరులు కల్యాణ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సోలార్ విద్యుత్‌పై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

వెంకటగిరి టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజలు సోలార్ విద్యుత్‌పై దృష్టి సారించాలని ఎంపీడీవో కోటీశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందన్నారు. గృహ అవసరాలకు వినియోగించాక మిగిలిన విద్యుత్‌ను అమ్ముకోవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు

వెంకటగిరి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుండ్లసముద్రం ఎస్టీ కాలనీలో నివసిస్తున్న 21మందికి కలెక్టర్ వెంకటేశ్వర్ పొజిషన్ సర్టిఫికెట్లు గురువారం అందజేస్తారని తహసీల్దార్ రాంబాబు తెలిపారు.

అవమానించారని... యువతి ఆత్మహత్య



లక్ష్మీప్రియ (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నలుగురిలో తనను అవమానించారని మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలోని సప్తగిరి కట్టకాలనీలో నివాసం ఉంటున్న అమరావతికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అమరావతి తడలోని ఓ పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈమే చిన్నకుమార్తె లక్ష్మీప్రియ కొంత కాలంగా పట్టణంలోని ఓ సూపర్ బజార్‌లో పనిచేసేది. మూడు రోజుల క్రితం క్యాష్ కౌంటర్‌లో రూ.17,000 తగ్గాయని సూపర్ బజార్ యాజమాన్యం ప్రశ్నించడమే కాకుండా కుటుంబసభ్యులకు తెలియ జేశారు. అంతేకాకుండా సూపర్ బజార్ యాజమాన్యం పోలీసులకు తెలపడంతో లక్ష్మీప్రియను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారించినట్లు తెలిసింది. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మీప్రియ మంగళవారం ఇంట్లోనే ఉరివేసుకొని మృతి చెందింది. అర్బన్ సీఐ బాబి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేశారు. సూపర్ బజార్ యాజమాన్యం నిందించడంతో అవమాన భారంతో లక్ష్మీప్రియ ఆత్మహత్య చేసుకుందని కుటుంబసభ్యులు ఆరోపించారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య

చిట్టమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొక్కుపాళెం గ్రామానికి చెందిన ఇంగిలాల గిరి(37) గడ్డిమందు తాగి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. గత కొంతకాలంగా గిరి దంపతుల మధ్య మనస్పర్థలు చోటు చేసుకోవడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్థాపానికి గురైన గిరి మంగళవారం గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గ్రామస్తులు గమనించి నెల్లూరుకు తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వరి సాగులో వంగడాల ఎంపికే కీలకం

పెళ్లకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరి సాగు చేయడంలో రైతులు మేలైన వంగడాలను ఎంపిక చేసుకోవాలని కృషి విజ్ఞాన్ కేంద్ర శాస్త్రవేత్త నాగార్జునరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని తాళ్వాయిపాడు, కానూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారి శారద మాట్లాడుతూ నిమ్మలో కొమ్మల కత్తిరింపులు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. బిందు సేద్యం పరికరాలపై ప్రభుత్వం అందించే రాయితీలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గొడవర్తి ప్రవీణ, సాయిల్ సెంటిస్ట్ రాజీవన, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అధిక మోతాదు ఎరువులతో అనర్థం

ఓజిలి, నవంబరు 6: పంటలకు అధిక మోతాదులో ఎరువులు వాడితే భూసారంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఫలితంగా రైతులు నష్టపోతారని ఏవో విజయలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలోని సగుటూరు, వీర్లగునపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతులకు వివిధ పంటల సాగు, ఎరువుల వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నారుమడిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

కోట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నం, సిద్ధవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలో నారుమడిలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. జింక్ లోపాన్ని ఎలా నివారించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్ రకం వరి విత్తనాలు రైతు సేవాకేంద్రాల్లో రాయితీపై అందజేస్తున్నట్లు ఏవో తెలిపారు.

ఎరువుల యాజమాన్యమే కీలకం

వాకాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరి పంట సాగులో నారుమడుల నుంచి దిగుబడి వచ్చేవరకు మెలుకువలు పాలటించాలని వ్యవసాయ అధికారి దీప అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ వరిసాగులో నీటి యాజమాన్యంతో పాటు ఎరువులు, పురుగుమందుల వినియోగం కీలకమన్నారు. భూసార పరీక్షల ఫలితాలకు అనుగుణంగా ఎరువులను వాడినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఎకరాకు 25 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం, 12 కిలోల పోటాష్ లభించే ఎరువులను మాత్రమే ఉపయోగించాలని, అంతకుమించి వాడితే పంటను తెగుళ్లు ఆశించే ప్రమాదం ఉందన్నారు.

నైపుణ్య గణన సర్వేపై శిక్షణ

వాకాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం నైపుణ్య సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో అన్నపూర్ణరావు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 8 అంశాలపై సర్వే చేపట్టి సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ జశ్వంత్ నైపుణ్య సర్వేలోని వివిధ అంశాలపై సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో బూత్‌క్యాంప్‌పై శిక్షణ తరగతులు

కోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బూత్‌క్యాంప్‌పై రెండు రోజుల శిక్షణ తరగతులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

కార్మికులకు న్యాయం చేయండి

నాయుడుపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు సెజ్‌లోని లాయల్ టెక్స్‌టైల్ యాజమాన్యం దిష్టిబొమ్మను కార్మికులు, సీఐటీయూ నాయకులు దగ్ధం చేశారు. సీఐటీయూ నాయకుడు ముకుంద మాట్లాడుతూ కార్మికులకు చట్టపరమైన రాయితీలు ఇవ్వకుండా కర్మాగారాన్ని మూసివేసి ఉద్యోగుల కడుపుకొట్టడం సబబుకాదన్నారు. కార్మికులు సంబంధిత ప్రభుత్వ అధికారుల వద్దకు వెళ్లి నెలల తరబడి వినతిపత్రాలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కర్మాగార కార్మికులు రత్నమ్మ, దీప, శివ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ప్రభుత్వాస్పత్రి రోడ్డు సుందరీకరణ ప్రారంభం


వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనతో అధ్వానంగా మారిన ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డులో వాకింగ్ ట్రాక్ సహా సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం పనులను పరిశీలించారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. అనంతరం విజయకుమార్ విలేకరులతో మాట్లాడుతూ... గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు పక్కన చికెన్ వ్యర్థాలు, భవన నిర్మాణ వ్యర్థాలు గుట్టలుగా పేరుకు పోయాయన్నారు. దీంతో ఈ ప్రాంతం పందులకు ఆవాసంగా మారిందన్నారు. ఈ మార్గంలో ఉన్న దక్షిణ కైలాసనగర్ కాలనీవాసులు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సుధీర్‌ను కోరారని, రూ.9 లక్షలతో వాకింగ్ ట్రాక్ పనులను అధికారులు ప్రారంభించారని తెలిపారు. అనంతరం సమీపంలోని అన్న క్యాంటీన్ ఆయన తనిఖీ చేశారు. తిరుపతి పార్లమెంట్ టీడీపీ కోశాధికారి రమేష్, నాయకులు ఎమ్మెస్‌రెడ్డి, విజయ్‌కుమార్, మనోజ్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం: సీపీఎం

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జెమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధమని... కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ విధానాలపై ప్రజలు తిరుగుబాటుకు సిద్ధం కావాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం ప్రాంతీయ ప్రథమ సభ జరిగింది. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ మండల శాఖ ప్రతినిధులు హాజరయ్యారు. పట్టణంలోని అంబేడ్కర్ కూడలి నుంచి డప్పు కళాకారుల వాయిద్యాలతో పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పుచ్చలపల్లి సుందరయ్యకు నివా ళు లర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ... ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇ చ్చిన ఎన్నికల హామీల అమలుపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సీపీ ఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శిగా గంధం మణి, సభ్యులతో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంగేరి పుల్లయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంతోనే ఉన్నత జీవితం

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ వికాసంతో ఉన్నత జీవితం సాధ్యమని తిరుపతి సెట్విన్ సంస్థ మేనేజర్ బీఎస్.రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం కౌటిల్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ సర్వీస్, సెట్విన్ తిరుపతి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, స్టడీ స్కిల్స్, కెరీర్ కౌన్సెలింగ్‌పై శిక్షణ ఇచ్చారు. స్వీయ క్రమశిక్షణ,సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, సెట్విన్ యువజన సేవా విభాగం మేనేజర్ మోహన్ కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి శివశంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డులో గౌడ వర్గానికి ప్రాధాన్యం


రాజశేఖర్ గౌడ్‌ను సత్కరిస్తున్న తోయజాక్షులు

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి పాలనలో గౌడ సామాజిక వర్గానికి గౌరవస్థానం లభించడం హర్షణీయమని టీడీపీ గౌడ సాధికార సమితి అధ్యక్షుడు తోయజాక్షులు అన్నారు. టీటీడీ పాలకమండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన మల్లెల రాజశేఖర్ గౌడ్‌ను తిరుమలలో కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం తోయజాక్షలు మాట్లాడుతూ... రాష్ట్ర క్యాబినెట్‌లో గౌడ సామాజిక వర్గానికి రెండు మంత్రి పదవులు ఇవ్వడం, ఆర్టీసీ చైర్మన్, టీటీడీ పాలకమండలిలో సభ్యత్వం, మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్ గర్వకారణమన్నారు.

పిల్లలను కార్మికులుగా మార్చడం నేరం

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పిల్లలను కార్మికులుగా మార్చడం నేర మని తిరుపతి సహాయ కార్మిక కమిషనర్ చిన్న లాలప్ప అన్నారు. పాన్ ఇం డియా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా బుధ వారం కార్మిక శాఖ, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ, ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బీపీ అగ్రహారం, ప్రాజెక్టు వీధి, దర్గా మిట్ట, పానగల్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు , కొత్తపేట, బహదూర్ పేటల్లోని దుకాణాలను తనిఖీ చేశారు. నలుగురు బాల కార్మికులను గుర్తించారు. అనంతరం తొట్టంబేడు మండలంలోని పిచ్చాటూరు రోడ్డు, చెన్నై రోడ్డులో కూడా దుకాణాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి సహాయ కార్మిక అధికారి జి.రంగనాథ్, తిరుపతి సహాయ కార్మిక అధికారులు శ్రీమన్నారాయణ, రాజయ్య, ప్రగతి స్వచ్ఛంద సంస్థ, న్యాయశాఖ సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముడియూరుకు సబ్‌స్టేషన్ మంజూరు


ఆదిమూలానికి సన్మానం

పిచ్చాటూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడియూరుకు 11కేవీ సబ్ స్టేషన్‌ను ప్రభుత్వం మంజూరు చేయడంతో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలాన్ని గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముడియూరుకు సబ్‌స్టేషన్ నిర్మాణంతో పాటు రూ.13 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి గ్రామానికి మహర్దశ వచ్చేటట్లు చేయాల్సిన బాధ్యత నేతలపై ఉందన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆశీస్సులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుటడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మునిశేఖర్‌రెడ్డి, రమేష్, గోపి, శ్రీనివాసులు, చక్రవర్తి, అబి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడు చెంచయ్య

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మహిళను హతమార్చి పరారైన కేసులో చెంచయ్య అనే నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవి నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు... బుచ్చినా యుడు కండ్రిగ మండలం కాటూరుకు చెందిన కృష్ణయ్య శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు సమీపంలో ఓ రైతు వద్ద పంట పొలాల్లో పని చేసేవాడు. అక్కడే పని చేస్తున్న తుపాకుల బత్తెమ్మతో పరిచయం ఏర్పడి మూడో వివాహం చేసుకున్నాడు. వారి మధ్య విభేదాలు తలెత్తడంతో గత నెల 3న బత్తెమ్మను హతమార్చిన చెంచయ్య ఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం నిందితుడు చెంచయ్య రూరల్ పోలీసులకు లొంగి పోయాడు. అతన్ని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ రవి నాయక్ తెలిపారు.

ముక్కంటి సేవలో ఎంపీ వేమిరెడ్డి



శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని బుధవారం ఎంపీ వేమిరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో బాపిరెడ్డి వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక బహూకరించారు.

అధికారనంది బాలాలయం



శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం రాత్రి అధికార నంది బాలాలయ క్రతువును వేదక్తంగా నిర్వహించారు. ఆలయంలోని 16 కాళ్ల మండపంలో కలశ స్థాపన చేశారు. అనంతరం వేదమంత్రోచ్ఛారణల మధ్య సంకల్పం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ముక్కంటి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని బుధవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. తిరుచానూరుకు చెందిన శివనాట్య కళానిలయం 21 మంది సభ్యులతో గురువు సంధ్య ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. ముక్కంటి ఆలయ అధికారులు కళాకారులను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు వేరుశనగ విత్తనాల పంపిణీ

నారాయణవనం, నవంబర్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలమంగళం (దక్షిణం) గ్రామంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు 40 శాతం రాయితీపై వేరుశనగ విత్తన కాయలను, మినుమ విత్తనాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ జరుగుతుందని ఈవో శోభారాణి ఒక ప్రకటలో తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిబంధనల మేరకే ఇసుక రవాణా సాగించాలి


ఇసుక ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ తిమ్మయ్య

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇసుక రవాణా సాగాలని బుచ్చినాయుడు కండ్రిగ సీఐ తిమ్మయ్య హెచ్చరించారు. తొట్టంబేడు మండలం పెన్నలపాడు మార్గంలో బుధవారం ఇసుక రవాణా వాహనాలు తనిఖీ చేసి 15 ట్రాక్టర్లకు జరిమానా విధించారు. ఇటీవల తొట్టంబేడు మండలం పెన్నలపాడు వద్ద ఇసుక ట్రాక్టర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు పంట పొలాల్లో పడిపోయిన విషయం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన సీఐ తిమ్మయ్య ఇసుక రవాణా ట్రాక్టర్లపై నిఘా పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు ప్రభుత్వం నిర్దేశించిన రీచ్‌ల నుంచి మాత్రమే ఇసుక తరలించాలని చెప్పారు. యంత్రాలను ఉపయోగించి ఇసుక తవ్వి టిప్పర్లు, లారీల ద్వారా తరలించేందుకు అను మతి లేదన్నారు. అలా అక్రమ తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక రీచ్‌ల నుంచి కూలీల ద్వారా సేకరించిన ఇసుకను తరలించే ట్రాక్టర్ల యజమానులు నిబంధనలు పాటించాలని సూచించారు. లైసెన్స్ లేని, మద్యం తాగి వాహనాలను నడిపే వారిని డ్రైవర్లుగా నియమించుకోవడం నేరమన్నారు. యజమానులు జాగ్రత్తగా తమ ట్రాక్టర్లను నిపుణు లైన డ్రైవర్లతో నిర్వహించుకోవాలని హెచ్చరించారు. అలాగే ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లకు రిజిస్ట్రేషన్ నెంబర్లు కచ్చితంగా కనిపించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని 15 ఇసుక ట్రాక్టర్లకు జరిమానా విధించారు. యజమానులు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.




కాంపాళెంలో నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రం - కాటూరులో మూలన పడ్డ ఈ-రిక్షాలు - పల్లమాలలో తుప్పుపట్టిన ఈ-రిక్షాలు

నిరుపయోగంగా సంపద కేంద్రాలు

- మరమ్మతులకు నోచుకోని ఈ-రిక్షాలు
- ఎక్కడి చెత్త అక్కడే
- పట్టించుకోని అధికారులు


బీఎన్‌కండ్రిగలో శ్మశానం దగ్గర పోసిన చెత్త పక్కనే కర్మక్రియలు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను చెత్త రహితంగా మార్చేందుకు గత టీడీపీ ప్రభుత్వం ప్రతి పంచాయతీలో రూ.7లక్షల నుంచి రూ.10లక్షలు వెచ్చించి చెత్త నుంచి సంపద కేంద్రాలను ఏర్పాటు చేసింది. గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించడానికి గ్రీన్ అంబాసిడర్లను నియమించింది. ఈ-రిక్షాలను అందించి చెత్తను సంపద కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేసింది. అయితే ప్రస్తుతం చెత్త నుంచి సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించకపోవడంతో చెత్త సేకరించడం మానేశారు. ఈ-రిక్షాలు మరమ్మతులకు గురై మూలన పడ్డాయి. గత ప్రభుత్వ హయాంలో తడి, పొడి చెత్తను రీసైక్లింగ్ చేసి వర్మీ కంపోస్టు తయారు చేసి పంచాయతీలకు ఆదాయం సమకూర్చారు. అయితే ప్రస్తుతం పల్లమాల పంచాయతీలో చెత్త సేకరించే రిక్షాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలోని 28 పంచాయతీల్లో దాదాపు ఇదే పరిస్థితి. ఒక్క బీఎన్‌కండ్రిగ పంచాయతీలో అరకొరగా చెత్తను సేకరించి శ్మశానంలో పడేస్తున్నారు. లక్షల రూపాయలతో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాలను కూటమి ప్రభుత్వం మళ్లీ అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది.

మధ్యాహ్న భోజనం నాణ్యంగా పెట్టాలి


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం నాణ్యంగా వడ్డించాలని ఎంఈవో(2) మునిసుబ్రహ్మణ్యం ఆదేశించారు. మండలంలోని జీఎన్‌కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని వంట నిర్వాహకులను ఆదేశించారు. అంతకముందు విద్యార్థులు చదువులపై ఆరా తీశారు. వెనబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

కీళపూడిలో అభివృద్ధి పనులకు శ్రీకారం


ఎక్స్‌కవేటర్‌తో పిచ్చి మొక్కల తొలగింపు

పిచ్చాటూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కీళపూడి గ్రామంలో అభివృద్ధి పనులకు కూటమి నేతలు శ్రీకారం చుట్టారు. బుధవారం గ్రామంలోని వీధుల్లో మురుగునీటి కాలువలు నిర్మించేందుకు ఎక్స్‌కవటర్ల ద్వారా పిచ్చి మొక్కలు, ముళ్లకంపలు తొలగించి గోతులు తీయించారు. గ్రామానికి మంజూరైన సిమెంటు రోడ్లను కూడా త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ముక్కంటి సేవలో నర్సిరెడ్డి

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని టీటీడీ పాలక మండలి సభ్యుడు నర్సిరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురువారెడ్డి స్థానిక నాయకులతో కలిసి నాలుగో గేటు వద్ద వారికి స్వాగతం పలికారు. అనంతరం అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం మృత్యుంజయ స్వామి సన్నిధిలో వేద పండితులు శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. టీడీపీ నాయకులు స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని బహూకరించారు.

రైతులకు అండగా నిలవండి


డీఆర్వో నరసింహులుతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అధికార యంత్రాంగం రైతులకు అండగా నిలవాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు తిరుపతి కలెక్టరేట్‌లో డీఆర్వో నరసింహులును బుధవారం తెలుగు రైతు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి పార్లమెంట్ తెలుగురైతు అధ్యక్షుడు గోపీనాథ రెడ్డి మాట్లాడుతూ... అధికార యంత్రాంగం రైతులకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్ నాయుడు, కేవీబీపురం మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు, టీడీపీ నాయకులు జి.సురేష్ నాయుడు, దేవి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురంలో మోస్తరు వర్షం


రంగయ్యగుంట వీధిలో నిలిచిన నీరు

కేవీబీపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో గ్రామీణ మట్టి రోడ్లలో వర్షపు నీలిచి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. అయితే రబీ సీజన్ కావడంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభి ఉన్నారు. ఈ మోస్తరు వర్షం పంటకు దోహదపడుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెరువులు, భూ ఆక్రమణల పరిశీలన


చెరువును పరిశీలిస్తున్న ఆర్డీవో

కేవీబీపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల ఆక్రమణలకు గురైన చెరువులు, భూములను శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి పరిశీలించారు. బుధవారం ఆయన మండలంలోని తిమ్మాసముద్రం చిన్న చెరువు, కల్లపూడిలో వివాదంలో ఉన్న దళితుల భూములను పరిశీలించారు.తమ భూములను ఆక్రమించి సాగు చేసుకుంటున్నారని, తమకు న్యాయం చేయాలని దళితులు ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. చెరువులు, భూముల ఆక్రమణలపై సర్వే చేసి నివేదికలు ఇవ్వాలని తహసీల్దార్ మునిరత్నంరెడ్డిని ఆదేశించారు.

వాహనాల రికార్డులు తప్పనిసరి

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆటోలు ఇతర వాహనాలకు తప్పనిసరిగా రికార్డులు ఉండాలని ఎస్ఐ విశ్వనాథ నాయుడు తెలిపారు. మండలంలో కేటి రోడ్డు పదవ మైలు దగ్గర బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. రికార్డులు లేని పలు వాహనాలకు జరిమానా విధించారు. పలువురు ఆటోవాలాలు లైసెన్సు లేకుండా నడుపుతున్నారని, మొదటి సారి జరి మానా విధిస్తున్నామని, మరోసారి రికార్డులు లేకుంటే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.